శ్రీవారి లడ్డూ నాణ్యత పెంపునకు చర్యలు


డెయిరీ నిపుణులతో మాట్లాడుతున్న ఈవో శ్యామలారావు

తిరుపతి(అలిపిరి): శ్రీవారి లడ్డూ ప్రసాదాలు మరింత నాణ్యత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని టీటీడీ ఈవో శ్యామలారావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో శనివారం ఈవో కార్యాలయంలో టీటీడీ అధికారులు, డెయిరీ నిపుణులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ మరింత నాణ్యమైన నెయ్యిని ఎలా కొనుగోలు చేయాలి.. కొనుగోలు చేసిన నెయ్యి మరింత అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎలా పరీక్షించాలి తదితర అంశాలపై తెలియజేయాలని నిపుణులను కోరారు. లడ్డూ నాణ్యతను ప్రముఖ డెయిరీ నిపుణులు విజయభాస్కర్ రెడ్డి, సురేంద్రనాథ్ ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా అగ్ మార్క్, టీటీడీ నిబంధనల ప్రకారం నెయ్యి నాణ్యత ఎలా ఉండాలనే విషయమై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో వివరించారు. నాణ్యమైన నెయ్యి ప్రామాణిక విలువల గురించి తెలిపారు. త్వరలో లడ్డూ నాణ్యత మరింత పెంచడానికి అవసరమైన నెయ్యి సమకూర్చుకోవడానికి సమగ్ర నివేదిక సమర్పిస్తామన్నారు. సమావేశంలో జేఈవో గౌతమి, ఎస్వీ గోశాల డైరెక్టర్ హరినాథ్ రెడ్డి, కొనుగోలు జీఎం మురళీకృష్ణ, ఎస్ఈ–2 జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాయకుడా.. నూరేళ్లు వర్ధిల్లు

- గజ మాలలతో సత్కరించిన యువత
- పుష్ప గుచ్ఛాలు, శాలువాలతో నేతల శుభాకాంక్షలు
- భారీ కేక్ కట్ చేయించిన ఆత్మీయులు
- ఘనంగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి జన్మదిన వేడుకలు


మోహిత్‌రెడ్డిని సన్మానిస్తున్న పాకాల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నంగా నరేష్‌రెడ్డి, నాయకులు


శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ వేముల యశోద, జెడ్పీటీసీ రత్నమ్మ, ఎంపీటీసీలు

సందడే.. సందడి

తిరుపతి రూరల్: 'నాయకుడా.. నూరేళ్లు వర్ధిల్లు' అంటూ తమ అభిమాన యువనేత, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని దీవించారు.. శనివారం ఆయన పుట్టిన రోజు ఆత్మీయులందరికీ సంబరమైంది. యువత భారీ గజమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఆత్మీయులు రకరకాల ఆకృతుల్లో ఉన్న కేక్‌లు కట్ చేయించి ఆశీస్సులు అందించారు. వైఎస్సార్ సీపీనాయకులు, కార్యకర్తలతో పాటు పలువురు శ్రేయోభిలాషులు తుమ్మలగుంటకు చేరుకుని తమదైన శైలిలో ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపి, తమ అభిమానం చాటుకున్నారు. చంద్రగిరి నియోజకవర్గం వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఉదయం మోహిత్‌రెడ్డి ఇంటి వద్దకు చేరుకుని భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. జన్మదినం సందర్భంగా తుమ్మలగుంట గ్రామంలో ఆయన ఇంటి వద్ద జన సందడి నెలకొంది. ముందుగా తన తల్లిదండ్రులు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, లక్ష్మి దంపతుల నుంచి ఆశీస్సులు తీసుకున్న మోహిత్‌రెడ్డి ఆ తర్వాత శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి దర్శనం చేసుకున్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు తరలిరావడంతో వారందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఆశీస్సులు తీసుకున్నారు. మోహిత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. బాణాసంచా పేల్చి గజమాలలతో సత్కరించారు. అలాగే పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు చెప్పి అంతా మంచి జరగాలని ఆశీస్సులు అందించారు. వేద పండితుల ఆశీర్వచనాలు, మహిళల దీవెనలతో మోహిత్‌రెడ్డి నిండు నూరేళ్లు సంతోషంగా జీవించాలని కోరుకున్నారు. జన్మదిన శుభాకాంక్షలు చెప్పేందుకు వచ్చిన కొంత మంది పార్టీ నేతలు, కార్యకర్తలు పుష్ప గుచ్ఛాలు, శాలువాలకు బదులుగా నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను తీసుకువచ్చి శుభాకాంక్షలు చెప్పడం విశేషం.

ఎస్‌డీఎస్ మూర్తికి ఐఎమ్ఆర్ఎఫ్ అవార్డు



తిరుపతి సిటీ: ఎస్వీయూ బయోకెమిస్ట్రీ విభాగం అధ్యాపకుడు ప్రొఫెసర్ ఎస్‌డీఎస్ మూర్తికి ఐఎమ్ఆర్ఎఫ్ అవార్డు లభించింది. విజయవాడకు చెందిన ఇంటర్నేషనల్ మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ ఫౌండేషన్ (ఐఎమ్ఆర్ఎఫ్) 2024 సంవత్సరానికి సంబంధించి అకడమిక్ అండ్ రీసెర్చ్ ఎక్సలెన్సీ అవార్డు పొందారు. ఈ నెల 22న యునైటెడ్ నేషన్స్ పబ్లిక్ సర్వీస్ డే సందర్భంగా ఈ అవార్డుకు ఎంపికయ్యారు. వర్సిటీ అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఆటోల రాకపోకలపై ఆంక్షలు తగదు

తిరుపతి మంగళం: కరకంబాడి వైపు నుంచి తిరుపతి నగరంలోకి ప్రయాణికులతో వచ్చే ఆటోల రాకపోకలపై ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించడం తగదని ఆటో డ్రైవర్లు అన్నారు. ట్రాఫిక్ ఆంక్షలను నిరసిస్తూ తిరుపతి నగర పరిధి రెడ్డిగుంట సమీపంలోని కరకంబాడి తిరుపతి మార్గంపై ఆటో డ్రైవర్లు శనివారం నిరసన తెలియజేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ లీలామహల్ వైపునకు ఆటోలు వెళ్లాల్సిందేనని ఆటోడ్రైవర్లు పోలీసులకు తెలిపారు. అయితే పోలీసులు ఇందుకు ససేమిరా అనడంతో ఆటోడ్రైవర్లు రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు. ఈ నేపథ్యంలో కరకంబాడి మార్గంలో వాహనాలతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆ మార్గంలో వెళ్తున్న టీడీపీ నాయకుడు కృష్ణయాదవ్, కాయం వెంకటరత్నం పోలీసులతో మాట్లాడి ఆటోలను నగరంలోకి వెళ్లనీయాలని కోరారు. తాము పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తామని, అప్పటి వరకు ఎలాంటి ఆంక్షలు అమలు చేయవద్దని సూచించడంతో పోలీసులు ఆటోలను నగరంలోకి పంపించారు.

నేడు విద్యుత్ బిల్లుల చెల్లింపులు

తిరుపతి రూరల్: తిరుపతి సర్కిల్ పరిధి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాలు ఆదివారం కూడా పని చేస్తాయని సర్కిల్ ఎస్ఈ సురేంద్రనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను సమీపంలోని విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాల్లో చెల్లించవచ్చని సూచించారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీటీడీ ఉద్యోగులకు ఘన సన్మానం



తిరుపతి(అలిపిరి): టీటీడీలో వివిధ విభాగాలలో ఉద్యోగ సేవలు అందించి శనివారం పదవీ విరమణ చేస్తున్న టీటీడీ ఉద్యోగులను ఎంప్లాయిస్ బ్యాంకు ఉపాధ్యక్షుడు, ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సునీల్ కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీహరి, కోశాధికారి రేఖ, అసోసియేట్ ప్రెసిడెంట్ మణికంఠ పాల్గొన్నారు.

ఎంబీఏ ఫలితాలలో రిమ్స్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

తిరుపతి సిటీ: ఎస్వీయూ విడుదల చేసిన ఎంబీఏ మూడో సెమిస్టర్ ఫలితాలలో రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్స్(రిమ్స్) కళాశాల విద్యార్థులు అత్యుత్తమ జీపీఏ సాధించారని ప్రిన్సిపల్ డాక్టర్ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఫలితాలలో ఎస్ చాదినీ, వి.వైష్ణవి 8.11 జీపీఏ సాధించగా వి.బిందు 8.01 సాధించిందని తెలిపారు. పరీక్షకు 80మంది విద్యార్థులు హాజరుకాగా అందులో 77 డిస్టింక్షన్లు, ముగ్గురు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై వందశాతం ఫలితాలు సాధించామని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అధినేతలు కొండారెడ్డి, ఆనంద్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, హెచ్ఓడీలు నిరంజన్‌రెడ్డి, మధుర విద్యార్థులను అభినందించి నగదు బహుమతులను అందజేశారు.

కృష్ణారెడ్డి సేవలు అభినందనీయం


కృష్ణారెడ్డి దంపతులకు సన్మానం

తిరుపతి అర్బన్: ఆర్టీసీలో పీఆర్ఓ కృష్ణారెడ్డి సేవలు అభినందనీయమని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్ రెడ్డి తెలిపారు. ఆర్టీసీలో 37ఏళ్లపాటు వివిధ హోదాల్లో ఆయన సేవలు అందిస్తూ ఉద్యోగ విరమణ పొందారని వెల్లడించారు. తిరుపతి డీపీటీఓ కార్యాలయంలో ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం పీఆర్ఓ కృష్ణారెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. ఆయనతోపాటు శనివారం తిరుపతి అసిస్టెంట్ మేనేజర్ ఫైనాన్స్ రమేష్, ఆర్టీసీ సూపరింటెండెంట్ పీసీ బాబు, టీటీఐ బి.మణి ఉద్యోగ విరమణ పొందారు.

ఆహార భద్రతా ప్రమాణాలు పాటించాలి

తిరుపతి అర్బన్: హోటల్స్, రెస్టారెంట్లు నిర్వహిస్తున్న వారు ఆహార భద్రతా ప్రమాణాలు తప్పకుండా పాటించాలని జిల్లా ఆహార భద్రతాధికారి మద్దిలేటి హెచ్చరించారు. ఆయన నేతృత్వంలో శనివారం తిరుపతిలోని పలు హోటల్స్, రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించారు. ఆయనతోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

పుట్టుకతో వచ్చే వ్యాధులపై అవగాహన పెంచాలి

తిరుపతి తుడా: చంటి బిడ్డలకు పుట్టుకతో వచ్చే వ్యాధులపై తల్లుల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ యు.శ్రీహరి సూచించారు. చిన్నపిల్లల్లో వచ్చే లోపాలపై డీఎంహెచ్ఓ కార్యాలయంలో మూడు రోజులపాటు నిర్వహించిన కార్యక్రమం శనివారంతో ముగిసింది. పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జన్యుపరమైన సమస్య, వైకల్యం, పుట్టుకతో వచ్చే లోపాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వైద్యాధికారులు శ్రీనివాస్ రావు, పద్మావతి, డాక్టర్ ప్రదీప్, గుణశేఖర్ పాల్గొన్నారు.

వర్సిటీలో స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ

తిరుపతి సిటీ: మహిళా వర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా జరిగిన ఉపాధిపై స్కిల్ వర్క్ షాపు శనివారం ముగిసింది. ఈ వర్క్‌షాపులో విద్యార్థినులకు తమ అధ్యయనానికి సంబంధించిన సాంకేతిక నైపుణ్యం, సాఫ్ట్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై శిక్షణ నిచ్చారు. దీనికి డైరెక్టర్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రొఫెసర్ ఎం విద్యావతి, ఎం ఉషారాణి, అధ్యాపకులు హాజరై శిక్షణ పొందిన విద్యార్థినులకు ప్రశంసిస్తూ బహుమతులు అందజేశారు.

రత్నరాజు సేవలు అమూల్యం


రత్నరాజు దంపతులకు సన్మానం

తిరుపతి తుడా: వైద్య విభాగంలో 42 ఏళ్ల పాటు సుదీర్ఘంగా వివిధ హోదాల్లో పనిచేసిన రత్నరాజు సేవలు అమూల్యమైనవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహర , రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు కొనియాడారు. రుయా అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదవీ విరమణ చేసిన ఎం.రత్నరాజుకి శనివారం వీడ్కోలు సమావేశాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఎస్వీ మెడికల్ కళాశాల రుయా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సిబ్బంది పెద్ద ఎత్తున తరలివచ్చి ఘనంగా సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, రుయా అధికారులు హరికృష్ణ, రమేష్, గిరి ప్రసాద్, భానుమతి, యూనియన్ నాయకులు రాజా, వర ప్రసాద్, కార్యాలయ సిబ్బంది, నర్సింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

శ్రీమూలస్థాన ఎల్లమ్మ హుండీ ఆదాయం రూ.5.16 లక్షలు

చంద్రగిరి: గ్రామ దేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.5,16,957లు వచ్చినట్లు ఆలయ ఈఓ రామకృష్ణారెడ్డి తెలిపారు. శనివారం ఆలయ ఆవరణలో మార్చి 27 నుంచి సోమవారం వరకు(94 రోజుల) వరకు వచ్చిన హుండీ ఆదాయాన్ని దేవదాయ ధర్మాదాయ శాఖ సీనియర్ అసిస్టెంటు దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో లెక్కించారు. అదే విధంగా తిరుపతి రూరల్ మండలం కొత్త చెర్లోపల్లి గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామివారి ఆలయ హుండీను లెక్కించారు. 94 రోజులకు గాను స్వామివారి హుండీలో రూ.1,19,440 ఆదాయం చేకూరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, రెవెన్యూ, పోలీసు శాఖ, సిబ్బంది పాల్గొన్నారు.

కాలువల్లో సిల్ట్ తొలగించండి

తిరుపతి తుడా: నగర వ్యాప్తంగా ప్రధాన కాలువల్లో పూడిక (సిల్ట్) తొలగించాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ అధికారులను ఆదేశించారు. అధికారులతో కలిసి ఆమె శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ప్రతి కాలువను శుభ్రం చేయాలని అధికారులకు సూచించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పారబోయవద్దని ఆమె విజ్ఞప్తి చేశారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్, మున్సిపల్ ఇంజినీర్ వెంకటరామిరెడ్డి, డీఈ శ్రావణి, చెంచయ్య పాల్గొన్నారు.

ధైర్యంగా ఉండండి.. మంచి రోజులు వస్తాయి


లక్ష్మీనారాయణను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి మంగళం: మంగళంలోని వైఎస్సార్ సీపీ నాయకులంతా ధైర్యంగా ఉండండి మళ్లీ మనకు మంచి రోజులు వస్తాయని చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. మంగళంలోని రణధీర్‌పురం పంచాయతీ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి లక్ష్మీనారాయణపై ఇటీవల టీడీపీ నాయకులు దాడి చేసిన విషయం తెలిసిందే. దాడి జరిగిన రోజే లక్ష్మీనారాయణకు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి పరామర్శించి, ధైర్యం చెప్పారు. శనివారం మళ్లీ లక్ష్మీనారాయణ నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పరామర్శించి ధైర్యం చెప్పారు.

8 మంది పోలీసులు పదవీ విరమణ


పదవీవిరమణ పొందిన పోలీస్ సిబ్బందితో ఎస్పీ

తిరుపతి క్రైమ్: జిల్లాలో విధులు నిర్వహిస్తూ 8 మంది పోలీసులు శనివారం పదవీ విరమణ పొందారు. పోలీస్ అతిథిగృహంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు వారిని ఘనంగా సత్కరించి, అభినందించారు. వ్యక్తిగత జీవితాన్ని ఎంతో కోల్పోయి ఉంటారని, ఇకపై పిల్లలతో సుఖసంతోషాలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ఏఎస్పీలు వెంకటరావు, విమలకుమారి పాల్గొన్నారు.